



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

EVENING EDITION 4PM

శుక్రవారం | 15 డిసెంబర్ 2023 | పేజీలు: 02

www.suryaa.com


## 65 స్థానాల్లో అభ్యర్థులు మార్పు..!



రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలిచేందుకు వైసిపి ఉవ్విళ్లూరుతోంది. ఇదివరకే జగన్ సర్వే చేయించారు. వ్యతిరేకత మూటగట్టుకున్నసిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చి ఇతరులను ఇన్చార్జులుగా నియమించే పనిలో వైసీపీ అధిష్టానం నిమగ్నమైంది. ఇప్పటికే 11 చోట్ల ఇన్చార్జిలను మార్చిన వైసీపీ మరో 65 చోట్ల అభ్యర్థులను మార్చేందుకు సిద్ధమైంది.!. జనాల్లోని వ్యతిరేకతను పోగొట్టేందుకు సిట్టింగ్ ఎమ్మెల్యేల స్థానంలో ఇతరులను ఇంచార్జులుగా నియమించనుంది.



## ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు మరోసారి పెంపు

ఆధార్‌లో అడ్రస్, తదితర వివరాలను సొంతంగా అధికారిక ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్‌లో అప్‌డేట్ చేసుకునే వారికి ఆ సేవలను ఉచితంగా అందజేసే గడువును యూఐడీఏఐ మరోసారి పెంచింది. మొదట 2023 ఫిబ్రవరి వరకే ఈ ఉచిత సేవలని యూఐడీఏఐ ప్రకటించగా.. అనంతరం ఆ గడువును మూడు దఫాలు పొడిగించింది. తాజాగా నాలుగోసారి వచ్చే ఏడాది మార్చి 14వ తేదీ వరకు పొడిగించింది.



## ఆస్పరిలో గోల్డ్ మైన్స్ గుర్తింపు

కర్నూలు జిల్లా ఆస్పరి మండలంలో గోల్డ్ మైన్స్ ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా తాజాగా గుర్తించింది. ఇక్కడ తవ్వకాలు చేయడం లాభదాయకమా? లేదా? అనే అంశంపై త్వరలో సర్వే చేయనున్నట్లు తెలుస్తోంది. తుగ్గలి మండలం జొన్నగిరిలో ఇప్పటికే బంగారు తవ్వకాలు చేస్తున్నారు. ఏడాదికి 750 కేజీల ఉత్పత్తి సామర్థ్యంతో పనులు ఇప్పటికే ప్రారంభం అయ్యాయి.



## ఇంట్లో ఉరేసుకుని ఐదుగురి సామూహిక ఆత్మహత్య

రాజస్థాన్‌లోని బీకానేర్‌లో దారుణం జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సామూహిక ఆత్మహత్యకు పాల్పడగా.. ఇందులో ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతులు హనుమాన్ సోనీ (45), భార్య విమల (40), మోహిత్ (18), రిషీ (16), గుడియా (14)గా పోలీసులు గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## శబరిమలలో అంతకంతకూ పెరుగుతోన్న భక్తుల రద్దీ..

శరణు అయ్యప్పా అంటూ ఆ శబరిగిరీశుని దర్శిస్తే భక్తుల బాగోగులు ఆ స్వామి చూసుకుంటారనీ.. పంపానదిలో స్నానమాచరిస్తే సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.. కానీ ఆ స్వామివారి దర్శనానికి వెళ్లిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా భక్తులు రావడం.. అదే సమయంలో అధికారులు, ఆలయసిబ్బంది మధ్య సమన్వయం లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ లక్ష మందికి పైగా భక్తులు స్వామి దర్శనానికి వస్తున్నారు. దీంతో స్వామి దర్శనానికి 18 నుంచి 24 గంటల పడుతోంది. క్యూలైన్‌లో నిరీక్షించలేక పలువురు యాత్రికులు దర్శనం చేసుకోకుండానే వెనుదిరుగుతున్నారు. పందళంలోని వలియకోయికల్ ఆలయానికి చేరుకుని నెయ్యి అభిషేకం చేసి వెనక్కి వెళ్లిపోతున్నారు. దర్శనం చేసుకోకుండా తిరిగి వెళ్లిపోతున్నవారిలో ఏపీ, కర్ణాటక, తమిళనాడుకు చెందిన భక్తులు ఎక్కువగా ఉన్నారు. ఈ ఘటనపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ ప్రభుత్వంతో మాట్లాడి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారాయన. వారం రోజులుగా శబరిమలలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ట్రావెన్‌కోర్ అధికారులు-పోలీసుల మధ్య సమన్వయ లోపం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పదునెట్టాంబడి దగ్గర భక్తులు నెమ్మదిగా కదలడం.. 18 మెట్ల దగ్గర పోలీసులు లేకపోవడం.. కేరళ పోలీసులకు.. దేవస్థానం అధికారులకు సమన్వయం లేకపోవడం వల్లే సజావుగా దర్శనం జరగడం లేదని భక్తులు మండిపడుతున్నారు



# ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరాలని కోరుతున్నా

## గవర్నర్ తమిళిసై

రాష్ట్రంలో ఏర్పడ్డ కొత్త ప్రభుత్వానికి గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ అభినందనలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరాలని కోరుతున్నా. ప్రజాసేవలో విజయం సాధించాలని కొత్త ప్రభుత్వాన్ని కోరుతున్నానని గవర్నర్ పేర్కొన్నారు. ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ అసెంబ్లీలో ప్రసంగించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే దిశగా కృషి చేస్తాం. ప్రజా ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రజావాణి చేపట్టాం. కొత్త ప్రభుత్వం ప్రయాణం ప్రజాసేవకు అంకితం కావాలని కోరుకుంటున్నాను. రైతులు, యువత, మహిళలకు ఈ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది. ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పించాలి. ప్రజా సంక్షేమం కోసమే ఆరు గ్యారెంటీలు ప్రకటించాం. హామీలకు చట్టబద్దత కల్పించే దస్త్రంపై తొలి సంతకం చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతిమాటకు మా ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే రెండు



గ్యారెంటీలు అమలు చేశాం. వచ్చే వంద రోజుల్లో ఆరు గ్యారెంటీల అమలుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రతి హామీకి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రజల ఆరోగ్య భద్రత.. మా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీని ప్రస్తుత అవసరాలకు తగినట్లు తీర్చిదిద్దాం. రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిధిని రూ. 10 లక్షలకు పెంచాం. ఎన్నికల వేళ కాంగ్రెస్ ప్రకటించిన అన్ని డిక్లరేషన్లు అమలు చేస్తాం. అమరవీరుల కుటుంబాలకు 250 గజాల ఇంటి స్థలం, గౌరవభృతి ఇస్తాం. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇచ్చేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రతి పంటకు మద్దతు ధర ఇస్తాం. రూ. 2 లక్షల రుణమాఫీపై త్వరలోనే కార్యాచరణ ఉంటుంది. అసైన్డ్, పోడు భూములకు త్వరలోనే పట్టాల పంపిణీ చేపడుతాం అని గవర్నర్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా యువతకు మేం ఇచ్చిన ప్రతి మాటను నెరవేర్చుతాం అని గవర్నర్ స్పష్టం చేశారు. ఏడాది లోపు మా ప్రభుత్వం 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తుందని, ఆరు నెలల్లో మెగా డీఎస్సీ నిర్వహించి, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పారు. రైతులు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళ, యువత, అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికులు ఇలా ప్రతీ వర్గాన్ని పరిగణనలోకి తీసుకుని సంక్షేమం, అభివృద్ధి కార్యాచరణ ఉంటుంది. యువత జాబ్ క్యాలెండర్ విషయంలో చెప్పిన మాట ప్రకారం కార్యాచరణ ఉంటుందని గవర్నర్ స్పష్టం చేశారు.

## యశోద ఆస్పత్రి నుంచి కేసీఆర్ డిశ్చార్జ్



బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ యశోద ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. అనంతరం బంజారాహిల్స్‌లోని నందినగర్ నివాసానికి ఆయన వెళ్లారు. ఈ నెల 7న ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో జారిపడటంతో కేసీఆర్ ఎడమ తుంటి భాగంలో తీవ్ర గాయమైన విషయం తెలిసిందే. దీంతో ఆయనకు సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో వైద్యులు తుంటి మార్పిడి శస్త్రచికిత్స చేశారు. అనంతరం ఆస్పత్రిలో కోలుకుంటున్న కేసీఆర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు పరామర్శించారు. ఆయన కోలుకోవడంతో నేడు ఆస్పత్రి నుంచి వైద్యులు డిశ్చార్జ్ చేశారు.



## తెలుగు రాష్ట్రాలు గజగజ

తెలుగు రాష్ట్రాలను చలి వణికిస్తోంది. ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో చలి పెరిగిపోతోంది. ఉష్ణోగ్రతలు తగ్గడానికి తోడు శీతల గాలులు బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో ఇంటిలో ఉన్నప్పటికీ జనంలో వణుకు తగ్గడం లేదు. దీంతో చలిమంటలను జనం ఆశ్రయిస్తున్నారు. స్వెట్టర్లు, రగ్గులు కప్పుకున్నా.. చలి మాత్రం వాయించేస్తోంది. దీంతో ఇదెక్కడి చలిరా బాబు అంటూ జనం గజగజా వణుకుతున్నారు. తెలంగాణ వ్యాప్తంగా రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో .. సిటీ వాసులు వణికిపోతున్నారు. పగటి పూట కూడా సాధారణ ఉష్ణోగ్రతలు తగ్గుతుండడంతో.. జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో రెండు రోజుల పాటు పగటిపూట కంటే రాత్రి పూట ఉష్ణోగ్రతలు పడిపోతాయని.. సాదారణం కన్నా తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు సూచిస్తున్నారు.

## భార్యా, పిల్లలను తుపాకీతో కాల్చి.. కలెక్టర్ గన్‌మెన్ ఆత్మహత్య





సిద్దిపేట జిల్లాలోని చిన్నకోడూరు మండలం రామునిపట్లలో విషాదం చోటుచేసుకున్నది. భార్యా, ఇద్దరు పిల్లలతో సహా తుపాకీతో కాల్చుకుని కలెక్టర్ గన్‌మెన్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఆకుల నరేశ్ అనే కానిస్టేబుల్ కలెక్టర్ గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన నరేశ్.. తన భార్య చైతన్య, కుమారుడు రేవంత్, కూతురు హిమశ్రీని తుపాకీతో కాల్చాడు. అనంతరం తానుకూడా కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాల గురించి ఆరా తీస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అప్పుల విషయంలో భార్యా భర్తల మధ్య గొడవ జరిగిందని తెలుస్తున్నది. గొడవ తీవ్రరూపం దాల్చడంతో ఆగ్రహానికి లోనైనా నరేశ్.. స్కూల్‌కి వెళ్లిన పిల్లలను ఇంటికి తీసుకువచ్చాడు. మొదట భార్యను తుపాకీతో కాల్చి.. పిల్లలను కూడా కాల్చిచంపాడు. అనంతరం తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలంలో క్లూస్ టీం ఆధారాలను సేకరిస్తున్నది.



## ప్రజాభవన్‌లో ప్రజావాణికి భారీ స్పందన.. అర కి.మీ మేర బారులు

ప్రజావాణి కార్యక్రమానికి శుక్రవారం భారీ స్పందన లభించింది. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా ఫులే ప్రజాభవన్‌కు వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో అర్జీదారులు తరలివచ్చారు. తమ సమస్యలపై వినతులు ఇచ్చేందుకు అర కిలోమీటరు మేర బారులు తీరారు. ఈ నెల 8న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇటీవల ప్రజాదర్బార్ పేరును ప్రజావాణిగా మారుస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతి మంగళవారం, శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి నిర్వహించనున్నట్లు తెలిపింది. ఉదయం 10 వరకు వచ్చిన వారికే అర్జీలు ఇచ్చేందుకు అవకాశం ఉండటంతో.. ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు.కాగా, ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని పలువురు అభ్యర్థులు, తమ సమస్యలు పరిష్కరించాలని లారీల యజమానులు, రెండు పడక గదుల ఇళ్లు మంజూరు, నిర్మాణం, వివిధ రకాల పింఛన్లపై వినతులు ఇచ్చేందుకు ఎక్కువ మంది ప్రజలు తరలివచ్చారు.




## వింటర్‌లో హీట్ పెంచేస్తున్న దిశా పటాని

మెగా హీరో వరుణ్ తేజ్ నటించిన "లోఫర్" చిత్రంతో హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన దిశా పటాని.. ఆ తర్వాత తెలుగులో ఏ చిత్రాలు చెయ్యలేదు. హిందీలో మాత్రం బ్యాక్ టు బ్యాక్ మూవీస్ చేస్తూ బాలీవుడ్లో బిజీ అయిపోయింది ఈ బ్యూటీ.. ఎమ్ఎస్ ధోనీ, భాగీ వంటి బ్లాక్ బస్టర్ సినిమాలతో బాలీవుడ్ ప్రేక్షకులను అలరించింది.అంతేకాదు ఎప్పటి కపుడు సోషల్ మీడియాలో హాట్ ఫోటోలతో రెచ్చిపోవడం ఈ భామకు అలవాటైయింది. లేటెస్ట్‌గా కొన్నిఫోటోలను పంచుకుంది. ప్రస్తుతం అవి వైరల్ అవుతున్నాయి.దిశా పటానీ విషయానికొస్తే.. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'లోఫర్' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైంది. ఈ సినిమా చూసినపుడు ఎవరూ అనుకోలేదు ఈ భామ బాలీవుడ్ టాప్ హీరోయిన్ అవుతుందని.. అంతేకాదు ఎప్పటి కపుడు సోషల్ మీడియాలో హాట్ ఫోటోలతో రెచ్చిపోవడం ఈ భామకు అలవాటైయింది.




# అందాల జాన్వీ

అందం, ప్రతిభ, నటనా కౌశలంతో ఆకాశమే హద్దుగా దూసుకెళుతోంది అలనాటి అందాల నటి శ్రీదేవి తనయ జాన్వీ కపూర్. శ్రీదేవి నటవారసురాలిగా సినీరంగ ప్రవేశం చేసిన జాన్వీ తదుపరి తనదైన శైలి, విలక్షణ ప్రతిభతో ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా సోషల్ మీడియాల్లో జాన్వీ కపూర్ కి యూత్ లో మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. జాన్వీ నిరంతర ఫొటోషూట్లు, వీడియో షూట్లకు భారీగా యువతరంలో ఫాలోయింగ్ ఉంది. లేటెస్ట్ గా జాన్వీ కపూర్ షేర్ చేసిన ఓ ఫోటోషూట్ అంతర్జాలంలో చర్చగా మారింది. జాన్వీ మిరుమిట్లు గొలిపే ఫ్రాక్ ధరించి..నీళ్లలో కిల్లర్ భంగిమలతో మతులు చెడగొట్టింది.కుర్రోళ్ళకి మత్తకళ్లతో చిత్తు చేసింది ఈ అమ్మడు. ఈ ఫొటోలను చూస్తున్న యువతరం 'మత్తు కళ్ల జవానీ!' అంటూ జాన్వీని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. డార్క్ థీమ్‌లో వెట్ లుక్ లో కనిపించిన జాన్వీకపూర్ అందానికి ఫిదా అయిపోతున్నారంతా.









## పార్లమెంట్ దాడుల ప్రధాన సూత్రధారి అరెస్ట్..

# వెలుగులోకి సంచలన విషయాలు

దేశవ్యాప్తంగా సంచలనం రేపిన పార్లమెంట్ ఘటనపై ఉన్నతస్థాయి విచారణ కొనసాగుతోంది. పట్టుబడ్డ ఆరుగురు నిందితులను లోతుగా విచారిస్తున్నారు. పార్లమెంట్‌పై దాడికి పాల్పడ్డ సాగర్‌శర్మ, మనోరంజన్, నీలం, అమోల్ షిండే, విక్కీశర్మ, అతని భార్యను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. అయితే ప్రధాన సూత్రధారి అయిన లలిత్ ఝా మాత్రం పోలీసుల నుంచి తప్పించుకొని రాజస్థాన్ లో తలదాచుకున్నట్లు వచ్చాయి. ఇతని కోసం రాజస్థాన్ లో తీవ్ర గాలింపు చర్యలు చేపట్టారు పోలీసులు. ఈ విషయం తెలుసుకున్న లలిత్ ఝా ఢిల్లీలోని కర్తవ్యపథ్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. వెంటనే ఇతనిని అరెస్ట్ చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు. పార్లమెంట్ పై దాడి చేసిన తరువాత బస్సులో రాజస్థాన్ లోని నాగౌర్ కు వెళ్లి ఒక హోటల్లో ఉన్నట్లు తెలిపాడు. అలాగే పార్లమెంట్ బయట జరిగిన తతంగాన్ని మొత్తం వీడియో తీసి కోల్ కత్తాలోని నీలక్ష్ ఐష్ కు పంపినట్లు పోలీసులు నిర్ధారించారు. నీలాక్ష్ ఐష్ కోల్ కత్తాలో ఒక స్వచ్ఛంద సంస్థ నడుపుతున్నట్లు తెలుస్తోంది. నీలాక్ష్ ను పట్టుకోవడం కోసం ప్రత్యేక బృందం ఇప్పటికే కోల్ కత్తా చేరుకుంది. ఇదిలా ఉంటే పార్లమెంట్ దాడిపై సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పక్కాప్లాన్ ప్రకారమే దాడికి పాల్పడ్డట్లు చెబుతున్నాడు నిందితుడు. వీరి వద్ద నుంచి ప్రధాని మిస్సింగ్ అంటూ ముద్రించిన కరపత్రాలను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. దీని వెనుక సంఘ విద్రోహ శక్తులు ఉన్నారంటూ పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరింత సమాచారం కోసం పట్టుబడ్డ నిందితులను ముంబై, మైసూర్, లక్నో తీసుకెళ్లి విచారించాల్సిన అవసరం ఉందంటున్నారు ఇన్వెస్టిగేషన్ అధికారులు. ప్రధానిని కనిపెట్టిన వారికి స్విస్ బ్యాంక్ నుంచి నగదు బహుమతి అంటూ ప్రకటన ఇచ్చేలా ముందుగా పాంప్లెట్లను ముద్రించినట్లు విచారణలో వెల్లడైంది. వీటిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే రైతుల ఆందోళనలు, మణిపూర్ అల్లర్ల నేపథ్యంలో దేశం దృష్టిని ఆకట్టుకోవడమే లక్ష్యంగా పార్లమెంట్‌పై దాడి చేసినట్టు నిర్ధారణ అయింది.

**పారమెంట్ ఘటనలో 13 మంది లోక్‌సభ సభ్యులపై వేటు..**

పార్లమెంట్లో అనుచితంగా ప్రవర్తించినందుకు 14 మంది ఎంపీలు సస్పెన్షన్‌కి గురయ్యారు. ఒక రాజ్యసభ ఎంపీతో పాటు 13 మంది లోక్‌సభ ఎంపీలపై పార్లమెంట్ చర్యలు తీసుకుంది. లోక్‌సభలో భద్రతా ఉల్లంఘన ఘటనపై విపక్షాల ఆందోళనతో నిన్న పార్లమెంట్ ఉభయసభలు దద్దరిల్లాయి. స్మోక్ అటాక్ ఘటనపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలంటూ విపక్ష ఎంపీలు పట్టుబడ్డారు. విపక్ష ఎంపీల ఆందోళనలతో ఎగువ, దిగువ సభలు పలు మార్లు వాయిదా పడ్డాయి. సభలు తిరిగి ప్రారంభమైనప్పటికీ ఎంపీలు ఆందోళన కొనసాగించారు. సభాపతి ఆదేశాలను పూర్తిగా ఉల్లంఘించారనే కారణంతో.. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీంతో ఈ శీతాకాల సమావేశాలు పూర్తయ్యే వరకు వారిపై వేటు పడింది. ముందుగా 14 మంది లోక్‌సభ సభ్యులను స్పీకర్ సస్పెండ్ చేశారు. అయితే అందులో ఒక సభ్యుడు ఆ సమయంలో సభలో లేకపోవడంతో వెనక్కి తీసుకున్నారు. ఫైనల్‌గా 13 మంది లోక్‌సభ సభ్యులపై చర్యలు తీసుకున్నారు.

**13 మంది సభ్యులు వీళ్లే..**

కాంగ్రెస్ నుంచి మాణికం ఠాగూర్, బెన్నీ బెహనాన్, వి కె శ్రీకందన్, మహ్మద్ జావేద్, హిబి ఈడెన్, టి ఎన్ ప్రతాపన్, జోతిమణి, రమ్య హరిదాస్, డీన్ కురియకోస్ ఉండగా.. సీపీఎం నుంచి పీ ఆర్ నటరాజన్, ఎస్. వెంకటేశన్ సస్పెండ్ అయ్యారు. ఇక డీఎంకే నుంచి కనిమొళి, సిపిఐకి చెందిన కె సుబ్బ రాయన్ పై కూడా సస్పెన్షన్ వేటు పడింది.

## అంతర్జాతీయ టీ20లో తొలి బ్యాట్స్‌మెన్‌గా

# సూర్య కుమార్

సౌతాఫ్రికాతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ అద్భుత సెంచరీ సాధించాడు. ఈ మ్యాచ్‌లో అత్యుత్తమంగా బ్యాటింగ్ చేసిన సూర్య కేవలం 56 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్సర్లతో 100 పరుగులు చేశాడు. సూర్య తన తుఫాన్ ఇన్నింగ్స్ కారణంగా టీమిండియా 201 పరుగుల భారీ స్కోరు చేయగలిగింది. ఈ లక్ష్యాన్ని ఛేదించిన దక్షిణాఫ్రికా జట్టు కేవలం 95 పరుగులకే ఆలౌటయి 106 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఈ మ్యాచ్‌లో టీమిండియాకు కెప్టెన్‌గా ఆడిన సూర్య.. టీ20 ఫార్మాట్‌లో ఈ ఫార్మాట్‌లో మరే ఆటగాడు చేయలేని నాలుగో సెంచరీని సాధించాడు. అంతర్జాతీయ టీ20లో సూర్యకుమార్ యాదవ్‌కు ఇది నాలుగో సెంచరీ. దీంతో పాటు అంతర్జాతీయ టీ20ల్లో ఉమ్మడి అత్యధిక స్కోరు సాధించిన ఆటగాడిగా నిలిచాడు. అతను రోహిత్ శర్మ, గ్లెన్ మాక్స్‌వెల్‌తో జతకట్టాడు. ఈ ఇద్దరు ఆటగాళ్లు టీ20లో 4 సెంచరీలు చేశారు. అయితే, సూర్యకుమార్ నాలుగు సెంచరీలు కూడా వివిధ దేశాల్లో వచ్చాయి. తద్వారా వివిధ దేశాల్లో జరిగిన టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో నాలుగు సెంచరీలు చేసిన తొలి ఆటగాడిగా సూర్య నిలిచాడు. సూర్యకుమార్ ఇప్పటివరకు ఇంగ్లండ్, న్యూజిలాండ్, భారత్, దక్షిణాఫ్రికా గడ్డపై టీ20 అంతర్జాతీయ సెంచరీలు చేశాడు.





# భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు..

బంగారం ధరలు నిన్న, మొన్నటి వరకూ తక్కువగా ఉన్నప్పటికీ ఈరోజు అమాంతం పెరిగిపోయింది. దీనికి ప్రధాన కారణం.. అంతర్జాతీయంగా డాలర్ విలువ పెరుగుదలతో పాటూ ఇజ్రాయిల్, పాలస్తీనా యుద్ధం కూడా పసిడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పైగా అంతర్జాతీయ మార్కెట్ ద్రవ్యోల్బణంలో వచ్చిన మార్పులు, విదేశాల్లో కొనసాగుతున్న ఆర్థిక మాంద్యం, రిజర్వ్ బ్యాంకు వడ్డీ రేట్లలో వచ్చిన హెచ్చుతగ్గులు ఇవన్నీ వెరసి బంగారు ధరల హెచ్చు, తగ్గుదలకు కారణం అవుతోంది. నిన్న హైదరాబాద్ మార్కెట్లో 10గ్రాములు 24 క్యారెట్ పసిడి ధర నిన్న రూ. 61,800 కాగా ఈరోజు తులంపై రూ. 1000 పెరిగింది. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్లో తులం 24 క్యారెట్ బంగారం ధర రూ. 62,890 కి చేరింది. ఇక 10గ్రాములు 22 క్యారెట్ బంగారం ధర నిన్న రూ. 56,650 ఉండగా ఈరోజు. రూ.57,650 కి చేరింది. ఈవారం మొత్తం ఇలాగే కొనసాగే అవకాశం ఉందంటున్నారు మార్కెట్ నిపుణులు. ఇక వెండి విషయానికొస్తే నిన్నమన్నటి వరకూ 76 నుంచి 77 వేల మధ్య ఉన్న ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఈరోజు కిలోపై ఏకంగా 2,500 పెరిగి 79,500 వద్ద కొనసాగుతోంది.

# యాదాద్రికి పెరిగిన భక్తుల రద్దీ..



తెలంగాణలో కొలువై ఉన్న మహిమాన్విత దేవుడు యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకోవడం కోసం భక్తులు దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తున్నారు. ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలుచేసిన అనంతరం అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.. గురు,శుక్రవారాల్లో భక్తుల రద్దీ భారీగా పెరిగినట్లు ఆలయ అధికారులు చెబుతున్నారు.. అంతేకాదు భక్తుల రద్దీతో స్వామివారి ఆదాయం రూ. 46,65,974 సమకూరిందని ఆలయ ఈవో తెలిపారు. తాజాగా ఈ రెండు రోజుల్లో పెరిగిన ఆదాయం వివరాలను ఆలయ అధికారులు తెలిపారు.. ఆ వివరాలను ఒకసారి తెలుసుకుందాం.. బుకింగ్ ద్వారా రూ. 1,06000, కైంకర్యముల ద్వారా రూ. 800, సుప్రభాతం ద్వారా రూ. 6,100, బ్రేక్ దర్శనం ద్వారా రూ. 1,60,200, వ్రతాల ద్వారా రూ. 1,16,000 ఆదాయం వచ్చిందని వివరించారు. అదే విధంగా వాహన పూజల ద్వారా రూ. 6,100 , వ్రత కైంకర్యాల ద్వారా రూ. 1,200, వీఐపీ(VIP) దర్శనం ద్వారా రూ. 1,20,000, ప్రచారశాఖ ద్వారా రూ. 50,400, పాతగుట్ట ద్వారా రూ. 32,320, కొండపైకి వాహనాల ప్రవేశం ద్వారా రూ. 3,00,000, యాదఋషి నిలయం ద్వారా రూ. 62,874 వచ్చిందని వెల్లడించారు. ప్రసాదవిక్రయం ద్వారా రూ. 11,20,900, శాశ్వత పూజల ద్వారా రూ. 10,000, కల్యాణ కట్ట ద్వారా రూ. 66,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ. 90,800, శివాలయం ద్వారా రూ. 8000, పుష్కరిణీ ద్వారా రూ. 1,600, మిగిలిన వాటి ద్వారా రూ. 57,200, లీగల్ లిజస్ ద్వారా రూ. 23,28,572, అన్నదానం ద్వారా రూ. 20,908 వరకు ఒక్కరోజులోనే ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.. ఇక ఈ మూడు రోజులు ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

# గ్రేటర్ పోలీసులో నయా జోష్..

ట్రై కమిషనర్లేటకు ముగ్గురు నూతన సీపీలను నియమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం పోలీసు శాఖతో పాటు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇంత టఫ్ ఆఫీసర్‌లను గ్రేటర్ హైదరాబాద్ పోలీసు బాసులుగా నియమించడం శాంతి భద్రతల విషయంలో కొత్త ప్రభుత్వం ఎంత నిక్కచ్చిగా ఉందో స్పష్టం అవుతుంది. మరో వైపు ఈ ఆఫీసర్‌లు కచ్చితంగా రూల్స్ ఫాలో అవుతారు కాబట్టి రాజకీయంగా లబ్ది పొందాలనుకునే వారికీ ఛాన్స్ ఉండదని తేలిపోయింది. దీంతో సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం చాలా అద్భుతమని అధికార, ఉద్యోగుల వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతుంది.

**టఫ్ ఆఫీసర్‌ల మెసేజ్‌లు ఇలా..**



"చట్టాన్ని గౌరవించే వారికే ఫ్రెండ్లీ పోలీసింగ్. చట్టాన్ని వ్యతిరేకించి.. ప్రజలను భయాందోళనకు గురి చేసే వారికి ఫ్రెండ్లీ పోలీసింగ్ అవసరం లేదు" ఇది హైదరాబాద్ సీపీ కొత్త కోట శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన రోజే అన్న మాట. గతంలో ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు కూడా శ్రీనివాస్ రెడ్డి తన సొంత శాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల్లో అవినీతికి పాల్పడిన అధికారులకు చెమటలు పట్టించారు.

# ఆకట్టుకుంటున్న అల్లరి నరేష్ ఇంట్రో గ్లింప్స్!

కింగ్ నాగార్జున ప్రధాన పాత్రలో, విజయ్ బిన్నీ దర్శకత్వం లో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ నా సామిరంగ చిత్రం సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి నెలలో గ్రాండ్ రిలీజ్ కి రెడీ అవుతోంది. ఈ చిత్రం లో అల్లరి నరేష్ ఒక కీలక పాత్రలో నటిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈ చిత్రం లో అల్లరి నరేష్ అంజి పాత్రలో ఆడియెన్స్ ను అలరించనున్నారు. ఈ పాత్ర కి సంబంధించిన ఇంట్రో గ్లింప్స్ ను మేకర్స్ నేడు రిలీజ్ చేయడం జరిగింది. వీడియో లో అల్లరి నరేష్ సూపర్ ఎనర్జిటిక్ గా ఉన్నారు. కింగ్ నాగార్జున తో ఉన్న సన్నివేశాలు చాలా బాగున్నాయి. మరోసారి అల్లరి నరేష్ తనదైన మార్క్ ను ఈ అంజి పాత్రతో వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

